క్లుప్తంగా

బురదమయం.. రాకపోకలకు నరకం



కృష్ణా: మండలంలోని సూకూర్‌లింగంపల్లి, మురహర్‌దొడ్డి, అడవి ఖానాపూర్, ఐనాపూర్ గ్రామాల్లోని రోడ్లు నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతినడంతో పాటు బురదమయంగా మారాయి. దీంతో రాత్రి సమయంలో ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. కనీసం తాత్కాలికంగా అయిన రోడ్లను బాగు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

కొత్తపల్లి యువకుడికి 'క్రాంతి పురస్కార్'



కొత్తపల్లి: మండలంలో సమాజ సేవకునిగా గుర్తింపు పొందిన కొత్తపల్లికి చెందిన నరేశ్‌కు క్రాంతి పురస్కార్ అవార్డు వరించింది. గత కొన్నేళ్లుగా సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని గుర్తింపు తెచ్చుకోవడంతో మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ సౌత్ ఇండియా అవార్డ్స్–2025కు సంబంధించి జిల్లా నుంచి నరేశ్ ఎంపికయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. గ్రామానికి చెందిన యువకుడికి అవార్డు రావడంతో గ్రామంలోని యువకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మాగనూర్: మండలకేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను మాగనూర్ పోలీసులు పట్టుకున్నారు. మాగనూర్ వైపు నుంచి మహబూబ్‌నగర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. టిప్పర్ డ్రైవర్ నాగేంద్రబాబు, ఓనర్ రంజిత్‌గౌడ్‌పై కేసు నమోసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ధన్వాడ: అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను స్థానిక పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. మండలంలోని యంనోనిపల్లి వద్ద మాత్రోనిపల్లి గుట్ట నుంచి మొరం పట్టితో వస్తున్న టిప్పర్‌ను తనిఖీల్లో భాగంగా పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఇంఛార్జి ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

తప్పిన ప్రమాదం

మాగనూర్: మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి గోవాకు వెళ్తున్న కారు మాగనూర్‌కు రాగానే రోడ్డు పక్కన ఉన్న పంక్చర్ షాపులోకి దూసుకెళ్లడంతో పాటు రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం సంభవించలేదు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి తండాకు చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు శనివారం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సమక్షంలో గులాబీ పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో గులాబీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీలో చేరిన వారిలో రమేశ్ నాయక్, పాండు నాయక్, మురళీ నాయక్, రవినాయక్, సురేశ్ నాయక్, అనిల్ నాయక్, రాహుల్ నాయక్‌తో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నారు.

మైనార్టీ కమిటీ అధ్యక్షుడిగా హుస్సేన్

నర్వ: మండల మైనార్టీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని మజీద్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల మైనార్టీ కమిటీ అధ్యక్షుడిగా సాహెబు హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా ఖాజామియ్యా, ఉపాధ్యక్షులుగా మహ్మద్ ఖాసీంసాబ్, బుర్హాన్‌సాహెబు, జాయింట్ సెక్రెటరీగా మహ్మద్ మన్సూర్ సాహెబ్ తదితరులను ఎన్నుకున్నారు.

అడుగేయలేం.. తీయలేం



పరిమళాపూర్‌కు వెళ్లే దారిలో గుంతలలో నిలిచిన నీరు

- భారీ వర్షాలతో అధ్వానంగా తయారైన రోడ్లు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో పాటు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో గుంతలు ఏర్పడి నీరు నిలవడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి మున్సిపల్ పార్కుకు వెళ్లే దారి మొత్తం గుంతలమయంగా మారింది. ఆ మార్గంలోనే జిల్లా కోర్టు, ప్రభుత్వ బ్యాంక్, పలు ప్రైవేట్ విద్యా సంస్థలు ఉండడంతో నిత్యం వేలాదిమంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా కోర్టు ముందు మురుగు నిలవడంతో కుంటను తలపించేలా ఉంది. అలాగే నర్సిరెడ్డి చౌరస్తా నుంచి యాదగిరి వెళ్లే ప్రధాన రహదారిపై కూడా అక్కడక్కడ రోడ్డుపై గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందుకు గురవుతున్నారు. మరి ముఖ్యంగా పాత బస్టాండ్ నుంచి పరిమళాపూర్‌కు వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. కావునా అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి ప్రయాణికులు, పాదాచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పాత బస్టాండ్ దగ్గర కుంటను తలపిస్తున్న రోడ్డు

ప్రమాదాలు జరుగుతున్నాయి..



రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇక వర్షాకాలంలో అయితే మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు. గుంతల నీరు నిలిచి సరిగా కనిపించకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తాత్కాలికంగా అయిన మరమ్మతు చేయించాలి.

–మల్లికార్జున్, లెక్చరర్

వాహనాలు దెబ్బతింటున్నాయి



రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు పడడంతో వాహనాలు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. మూడు నెలలకు ఒకసారి చేయించే సర్వీసింగ్ నెలకు ఒకసారి చేయించాల్సి వస్తుంది. అలాగే రోజు గుంతల రోడ్లపై వెళ్తుండడం వల్ల అనారోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. గుంతలు పూడ్చి వేయించాలి. –అంజి, ఆటో డ్రైవర్

తమ పరిధిలోకి రావు



మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులు తమ పరిధిలోకి రావు. ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తాయి. పట్టణంలో దెబ్బతిన్న రోడ్లను వినాయక చవితి ఉత్సవాల సమయంలో మరమ్మతు చేయించాం. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. వాటిని త్వరలోనే పూడ్చి వేయించేలా చర్యలు తీసుకుంటాం.

–నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక గురుకుల, కేజీబీవీ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజన్ సంస్థ కో ఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అందరం కలిసి కట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా 2026 నాటికి నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. విజన్ సంస్థ మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్‌ల భాగస్వామ్యంతో గత రెండేళ్లలో తాము దాదాపు 4 లక్షల బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు. విజన్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

నారాయణపేట రూరల్: ముంబైలో మృతి చెందిన నారాయణపేటకు చెందిన వలస కార్మికుడు కావలి యాదప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. యాదప్ప ఈనెల 8న చనిపోగా మృతదేహాన్ని శనివారం స్వగ్రామం కోటకొండకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో సీపీఎం నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే యాదయ్య కుటుంబానికి కాంట్రాక్టర్ రూ.10లక్షల ఆర్థిక సాయంతో పాటు అంబులెన్స్, అంత్యక్రియల కోసం మరో రూ.లక్ష కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బలరాం, దస్తప్ప, బాలప్ప, మల్లేష్, గోవింద్, సుదర్శన్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న కాంట్రాక్టర్

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించొద్దు

నారాయణపేట రూరల్: ప్రైవేటు పాఠశాలలు విద్యాశాఖ ఆదేశాలను పాటించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి మన్నె సతీష్ అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలలు శనివారం కూడా తరగతులు నిర్వహిస్తుండగా ఆయా పాఠశాలకు వెళ్లి తరగతులు బహిష్కరించారు. పాఠశాలల యాజమాన్యాలకు చెప్పినప్పటికీ తిరిగి ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఇబ్బందుల గురిచేయడం సరి కాదన్నారు. మరోసారి పునరావృతమైతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేష్, భరత్, తరుణ్, అభి, శివ, క్రాంతి పాల్గొన్నారు.



తరగతులు బహిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

వాలీబాల్ పోటీల్లో యువకుడి సత్తా

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక శ్రీ వేద సరస్వతి జూనియర్ కళాశాలకు చెందిన అఖిల్ ధన్వాడలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో సత్తా చాటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. జిల్లా జట్టుకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపల్ శేషమ్మ సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి జడ్చర్లలోని బాదేపల్లిలో జరగనున్న ఉమ్మడి పాలమూర్ జిల్లా స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఉపాధిహామీ కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

మాగనూర్: ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మాగనూర్ ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. ఇప్పటి నుంచి జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డుకు అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా ఉపాధిహామీ కూలీలు ఈ నెల 15వ తేదీ వరకు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామాలలో ఉండే క్షేత్ర సహాయకులు, మేటీల ద్వారా ఎన్ఎంఎస్ యాప్‌లో ఈ కేవైసీ ప్రక్రియ క్షేత్రస్థాయిలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కేవైసీ చేసుకొని జాబ్‌కార్డులు ఉండి కూడా ఈకేవైసీ చేసుకోని ఉపాధిహామీ కూలీలకు వారు చేసిన పని దినాలకు చెల్లింపులు జరగవన్నారు. కావున తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ఊట్కూర్: మండంలోని మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన నర్సింములపై అదే గ్రామానికి చెందిన బీరేందర్ అనే యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం తన కూతురితో, బీరేందర్ మాట్లాడుతుండగా నర్సింములు మందలించాడు. దీంతో ఆయనపై కత్తితో దాడి చేయగా మనికట్టుకు తీవ్రగాయమైంది. ఇరుగుపోరుగు వారు వచ్చేలోగా యువకుడు పరారయ్యాడు. బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ప్యాడీ క్లీనర్ మిషన్ ప్రారంభం



నారాయణపేట: రైతులు ప్యాడి క్లినర్ మిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.శివారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ప్యాడి క్లినర్ మిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చే ప్యాడితో పాటు జొన్నలు, మొక్క జొన్నలను సైతం ప్యాడి క్లినర్ మిషన్ ద్వారా క్లీన్ చేసుకోవచ్చన్నారు. ధాన్యంలో తాలు, పెడ్డ, కచర లేకుండా తీసుకొస్తే పంటకు మంచి ధర లభిస్తుందన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ కొనంగేరి, సభ్యులు తాహెర్ హుస్సైన్, శరణప్ప పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తపల్లి: మండల పరిధిలో విద్యుత్ స్తంభాలు, రోడ్ల పై నుంచి వెళ్లే హై టెన్షన్ విద్యుత్ తీగలను తొలగిస్తుండడంతో ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గోకుల్‌నగర్, విరారం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రైతులు, వ్యాపార, గృహ వినియోగదారులు సహకరించాలన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ధన్వాడ: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు కుమ్మరి వెంకట్రాములు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనె జీతం చెల్లించి, సమగ్రశిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రం నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. సమయానికి జీతం అందక ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మరణించిన ఉద్యోగులకు రూ.50లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు సలీం, రాఘవేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఐదు కేంద్రాల్లో భగవద్గీత కంఠస్థ, భావ విశ్లేషణ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా కార్యక్రమ నిర్వాహకులు రామాచారి తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూడు విభాగాల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు ఉంటాయన్నారు. మొదటి గ్రూప్‌లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగ యోగం, రెండో గ్రూప్‌లో పదో తరగతి నుంచి ఇంటర్ వరకు 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగం, మూడో గ్రూప్‌లో 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వారికి నిత్య జీవితంలో భగవద్గీత భావ విశ్లేషణపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 8, 9 తరగతులకు, 18 ఏళ్లలోపు 18 ఏళ్లు పైబడిన వారికి సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 11న నారాయణపేటలోని గీతా భారతి స్కూల్, 18న గద్వాలలోని శ్రీసరస్వతి టాలెంట్ స్కూల్, 23న వనపర్తి జిల్లా తాటిపాములలోని శ్రీరీతాంబర విద్యాలయం, 25న మహబూబ్‌నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో, 27న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో కంఠస్థ, భావ విశ్లేషణ పోటీలు ఉంటాయని చెప్పారు. ఈ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ అధికారులు సూచించారు.

రెండేళ్లలో అభివృద్ధి శూన్యం



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మండలంలోని శేర్నపల్లిలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉచితాల పేరుతో ఓట్లు వేయించుకొని గెలిచిన తర్వాత నాయకులు పత్తా లేకుండా పోయారని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని దివాలా తీస్తే కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి అనుభవం లేక రాష్ట్రాన్ని తిరోగమనంలో తీసుకెళ్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రపంచంలోనే గొప్ప ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారని, వెనకబాటు నుంచి ధనిక దేశాలకు దీటుగా దేశాన్ని తయారు చేశారన్నారు. పేదరిక నిర్మూలనతో పాటు యువత, రైతులను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండ సత్యయాదవ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంపీకి వినతులు

మండలంలోని శేర్నపల్లి నుంచి బొమ్మనుపాడు, శ్యాసన్ పల్లి గ్రామాలకు లింక్ రోడ్డు వేయించాలని మాజీ ఎంపీటీసీ చర్ల గుండప్ప ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అలాగే అంత్వర్ గ్రామంలో ఐమ్యాక్స్ లైట్లకు నిధులు మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలలో ఖాళీలను భర్తీ చేయాలని ఎంపీకి వినతిపత్రం అందజేశారు.

'పల్లె వెలుగు'.. అయినా ఆపరు

కొత్తపల్లి: మండలకేంద్రంలోని ప్రజలు మద్దూరు, మహబూబ్‌నగర్‌కు వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికి కారణం ఆర్టీసీ బస్సులు ఆపకపోవడమే. కొత్తపల్లి మీదుగా రోజూ అనేక పల్లె వెలుగు బస్సులు మద్దూరు, మహబూబ్‌నగర్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కొత్తపల్లిలో మాత్రం డ్రైవర్లు బస్సులను ఆపకుండానే వెళ్లిపోతున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెనుకాలో వచ్చే బస్సు ఆగుతుందని ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ ఆపకుండానే వెళ్లిపోతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు ఆపకుండా వెళ్లి పోతుండడంతో మద్దూరు, మహబూబ్‌నగర్ వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని, అధికారులు స్పందించి బస్సులను ఆపేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆపకుండానే వెళ్లిపోతున్న బస్సులు

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట

మరికల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వరి పంట దెబ్బతింది. మండలంలో 12 వేలకు పైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట కర్ర దశలో ఉంది. అయితే ఇటీవల భారీ వర్షాలు పడడంతో పంటకు చీడపీడలు ఆశించి పైర్లు వాలిపోతున్నాయి. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరికోతల సమయంలోనూ ఇలాగే వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలు చేతికి రాకుండా పోతాయని ఆవేదన చెందుతున్నారు.



వర్షాలకు నేల వాలిన వరి పంట

ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

దామరగిద్ద: పత్తి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాల్, మండల కార్యదర్శి అంజిలయ్యగౌడ్ కోరారు. శనివారం మండలంలోని దామరగిద్ద శివారులో అకాల వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దిగుబడులు తగ్గడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా పత్తి సాగు చేపట్టి నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరాకు రూ. 30 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కన్నప్ప, నర్సింహా, మహేష్ పాల్గొన్నారు.

మద్దూరులో ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలనం



పథ సంచలన్ నిర్వహిస్తున్న నాయకులు

మద్దూరు/మక్తల్: ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావించి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మద్దూరు అలాగే మక్తల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వేర్వేరుగా పథ సంచలనం నిర్వహించారు. పట్టణంలోని ప్రాథమిక పాఠశాల నుంచి పాతబస్టాండ్, పోలీస్ స్టేషన్, మీదుగా కోట్ల ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మళ్లీ పాఠశాల వరకు పథ సంచలనం నిర్వహించారు. అనంతరం విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీధర్ ఆర్‌ఎస్‌ఎస్ చేసే కార్యక్రమాలను వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఖండ ప్రముఖ్ విజయ్, రాఘవేందర్, సాయిలు, కాశీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడమే కాంగ్రెస్ నైజం

నారాయణపేట: బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అసలు రంగు బయట పడిందని, కాంగ్రెస్ పార్టీకి మోసం చేయడమే తప్ప.. రిజర్వేషన్లు కల్పించడంలో చిత్తశుద్ధి లేదని నారాయణపేట పట్టణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్ సాగర్, వేపూరు రాములు విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలపై కపట ప్రేమ వలకబోస్తూ మోసం చేస్తుందన్నారు. బీసీలకు నిజంగా రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి ఉంటే పకడ్బందీగా ప్రకటించాలన్నారు. అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపిన బిల్లుపై గడువు ముగియకుండా గవర్నర్ నిర్ణయం కోసం ఎదురు చూడకుండా రిజర్వేషన్లను ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. హామీలు విస్మరించి బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని జోస్యం చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ కుటిల రాజకీయాలను తిప్పికొట్టి బుద్ధి చెప్పాలని కోరారు.



మాట్లాడుతున్న వేపూరి రాములు, విజయ్‌సాగర్



ప్రమాదకరంగా వాగు దాటుతున్న గ్రామస్తులు

వంతెన నిర్మాణం చేపట్టాలి

నర్వ: మండలంలోని సీపూర్, కల్వాల్ గ్రామాల మధ్య ఉన్న వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా పారుతుండడంతో సమీప గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వాగులోకి నీరు ఉధృతంగా రావడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని ఇరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నిత్యం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి చదువుకునేందుకు వందలాది మంది విద్యార్థులు మండలానికి వస్తుంటారని వాగు దాటే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించి తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.